నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I | హైదరాబాద్, మంగళవారం 9 జూలై 2024 | RANGAREDDY

## ప్రభుత్వ బడులకు..
# ఉచిత విద్యుత్తు

**జీరో బిల్లులు అందజేసేందుకు కసరత్తు చేస్తున్న ప్రభుత్వం**

**ప్రత్యేక పోర్టల్‌తో అనుసంధానించేందుకు చర్యలు**

**జిల్లాలో 1,309 పాఠశాలలకు కరెంటు బిల్లుల మోత నుంచి విముక్తి**



రంగారెడ్డి, జూలై 8(నమస్తే తెలంగాణ) : వివిధ వర్గాలకు ఉచిత విద్యుత్తు సదుపాయాన్ని కల్పిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలకు సైతం ఉచిత విద్యుత్తు సౌలభ్యాన్ని కల్పించాలని యోచిస్తున్నది. ప్రతి నెలా వచ్చే కరెంటు బిల్లులను పాఠశాలల మెయింటెనెన్స్ నిధుల నుంచి చెల్లించాల్సి రావడం పాఠశాలల హెచ్‌ఎంలకు ఇబ్బందిగా మారింది. ఈ పరిస్థితుల్లో ఉచిత విద్యుత్తును అందించి పాఠశాలలకు ప్రభుత్వం పెద్ద ఉపశమనాన్ని కల్పించబోతున్నది. ఈ దిశగా ప్రభుత్వం తీవ్రస్థాయిలో కసరత్తు చేస్తుండడంతో రంగారెడ్డి జిల్లాలో 1,309 ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్తు పథకం ద్వారా ప్రయోజనం కలుగనున్నది.

### జీరో బిల్లులు అందజేత..

ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలు మెరుగుపడ్డాయి. తాగునీటి వసతితోపాటు విద్యుత్తు సౌకర్యం వంటి అన్ని రకాల వసతులను గత కేసీఆర్ ప్రభుత్వ హయాం నుంచే కల్పించారు. విద్యార్థులు ఉక్కపోతతో ఇబ్బందులు పడకుండా తరగతి గదుల్లో ఫ్యాన్లను ఏర్పాటు చేశారు. దీంతోపాటు చాలా పాఠశాలల్లో విద్యార్థులకు డిజిటల్ పాఠాలు అందుబాటులోకి వచ్చాయి. ఈక్రమంలో పెరిగిన విద్యుత్తు డిమాండ్‌తోపాటు బిల్లులు సైతం పాఠశాలలకు పెద్ద మొత్తంలో వస్తున్నాయి. అయితే వీటి చెల్లింపులు మాత్రం తలకుమించిన భారంగా మారింది. పాఠశాలల నిర్వహణకు ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధుల నుంచే విద్యుత్తు బిల్లులను చెల్లిస్తూ వస్తున్నారు. ప్రభుత్వం నుంచి వస్తున్న నిధులు పాఠశాలల నిర్వహణకే సరిపోతుండడంతో అదనంగా బిల్లులు చెల్లించాల్సి వస్తుండడంతో పాఠశాలల హెచ్‌ఎంలు ఇబ్బందులు పడుతున్నారు. ఇతర అవసరాలకే నిధులు సరిపోయి కొన్ని సందర్భాల్లో కరెంటు బిల్లులు పేరుకుపోతున్నాయి. ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్తును అందిస్తున్నప్పటికీ విధిగా జీరో బిల్లులను ఇవ్వనున్నది. విద్యుత్తు సిబ్బంది మీటరు రీడింగ్ తీసి బిల్లును ప్రతి నెలా అందజేయనున్నారు.

### ప్రత్యేక నిఘా ఉండేలా చర్యలు..

పాఠశాలలకు అందించే ఉచిత విద్యుత్తు పథకం పక్కదారి పట్టకుండా ఉండేందుకు ప్రభుత్వం ప్రత్యేక నిఘాను ఉంచనున్నది. ఉచిత విద్యుత్తు అమలు కోసం ప్రత్యేక పోర్టల్‌ను ఏర్పాటు చేయనున్నారు. ప్రతి నెలా ఎన్ని యూనిట్ల విద్యుత్తును వినియోగించారు?.. ఎంత బిల్లు వచ్చిందనే వివరాలను ప్రతి నెలా బిల్లులో పొందుపర్చనున్నారు. బిల్లుల చెల్లింపు, బకాయిలు తదితర వివరాలతో నివేదికలను విధిగా వెబ్ పోర్టల్‌లో అందుబాటులోకి తీసుకురానున్నారు. విద్యా సంస్థ, మండలం, జిల్లాల వారీగా ఈ నివేదికలను ఆన్‌లైన్‌లో పొందుపర్చనున్నారు. ఈ ప్రక్రియను ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించనున్నారు. సంబంధిత విభాగాల ఉన్నతాధికారులు బడ్జెట్ కేటాయింపుల నుంచి బిల్లులను చెల్లించేలా పోర్టల్‌ను రాష్ట్ర ఆర్థికశాఖతో అనుసంధానించనున్నారు. ఈ మేరకు ఆయా శాఖల ఉన్నతాధికారులు డిస్కంలకు బిల్లుల చెల్లింపులు జరుపుతారు.

**విధి విధానాలు రూపొందుతున్నాయి..**

ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్తు సదుపాయాన్ని కల్పించేందుకు ప్రభుత్వం విధివిధానాలను రూపొందిస్తున్నది. ఇందుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చిన వెంటనే అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్తు అందేలా చర్యలు తీసుకుంటాం.

**-సుశీందర్‌రావు, డీఈవో, రంగారెడ్డి జిల్లా**







# ఊరూరా ఏరులై..!

## గ్రామాల్లో విచ్చల విడిగా మద్యం అమ్మకాలు

- వీధికో బెల్టు షాపు.. కొరవడిన అధికారుల నిఘా
- కిరాణా షాపుల్లోనే యథేచ్ఛగా మద్యం విక్రయాలు
- కట్టడి చేయడంలో జిల్లా ఎక్సైజ్, పోలీసు యంత్రాంగం విఫలం



వికారాబాద్, జూలై 8 (నమస్తే తెలంగాణ) : గ్రామాల్లో మద్యం ఏరులై పారుతున్నది. వీధికొక బెల్టు షాపు ఏర్పాటై ఎప్పుడు కావాలంటే అప్పుడు మద్యం విచ్చలవిడిగా లభిస్తున్నది. పల్లెల్లోని ప్రతి కిరాణా దుకాణంలో మద్యం లభ్యమవుతున్నది. ఎక్సైజ్, పోలీసు యంత్రాంగం నిఘా కొరవడడంతో నిర్వాహకులు యథేచ్ఛగా మద్యం విక్రయాలు చేపడుతున్నారు. కొడంగల్, తాండూరు తదితర ప్రాంతాల్లో మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. అప్పుడప్పుడు తాగునీరన్న దొరకదేమోకానీ.. మద్యానికి మాత్రం ఎలాంటి కొరతలేదు. ఎక్కడపడితే.. అక్కడ.. ఎప్పుడు పడితే అప్పుడు లభ్యమవుతున్నది. దీంతో చాలామంది పేదలు మద్యానికి బానిసలై బతుకులు ఆగం చేసుకుంటున్నారు. అయినా జిల్లా ఎక్సైజ్, పోలీసు యంత్రాంగం నిర్లక్ష్య ధోరణిని వీడడం లేదు. బెల్టు షాపుల నిర్వహణ ఎక్సైజ్ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నదనే వాదనలూ లేకపోలేదు. ప్రతినెలా మామూళ్లు రాబడుతూ బెల్టు షాపులను ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. సారా రక్కసి సమూలంగా పోయినప్పటికీ.. మద్యం ఏరులై పారుతుండడంతో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో గతేడాది 59 మద్యం దుకాణాల్లో 7.77 లక్షల లీటర్ల మద్యం విక్రయాలతో రూ.715 కోట్ల ఆదాయంరాగా, ఈ ఏడాది 6 నెలల్లో 3.74 లక్షల లీటర్ల మద్యం విక్రయాలతో రూ.349 ఆదాయం వచ్చింది.

### 2 వేలకుపైగా బెల్టు షాపులు...!

జిల్లావ్యాప్తంగా కేవలం 59 లైసెన్స్‌డ్ మద్యం దుకాణాలుండగా, ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహించే బెల్టు షాపులు సుమారు 2 వేలకుపైగా ఉన్నట్లు తెలిసింది. ప్రతి గ్రామంలోని ఒక్కటి రెండు మినహా మిగతా కిరాణా దుకాణాల్లోనే బెల్టు షాపులను నిర్వహిస్తున్నారు. ఆశ్చర్యమేమిటంటే జిల్లా కేంద్రంలోని ఎస్పీ ఆఫీస్ ఎదురుగా ఉన్న కిరాణా దుకాణాల్లో తెల్లవారుజాము నుంచే బహిరంగంగానే మద్యం విక్రయిస్తున్నారు. ఎక్సైజ్‌తో పాటు పోలీసులకు తెలిసినా మామూళ్లతో సరిపెట్టుకొని చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. గ్రామాల్లో ఏదైనా సంఘటన జరిగితే తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు..

అనంతరం ఎలాంటి కేసులు లేకుండా వదిలేస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది. మరోవైపు బెల్టు షాపుల్లో ఎమ్మార్పీపై రూ.20 నుంచి రూ.50 వరకు అధికంగా వసూలు చేస్తున్నారు. జిల్లాలో లైసెన్స్‌డ్ మద్యం దుకాణాల ద్వారా 40 శాతం మేర మద్యం విక్రయాలు జరుగుతుండగా, బెల్టు షాపుల ద్వారా 60 శాతం మేర విక్రయాలు జరుగుతున్నట్లు తెలుస్తున్నది.

అయితే ఎక్సైజ్, పోలీసు శాఖల్లోని కింది స్థాయి నుంచి పై స్థాయి అధికారుల వరకు మామూళ్లు అందుతుండడంతో బెల్టు షాపులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

**బెల్టు షాపులను తొలగించాలి...**



మద్యాన్ని బెల్టు షాపుల ద్వారా విక్రయించరాదనే నిబంధన ఉన్నప్పటికీ గ్రామాల్లో ప్రతి కిరాణా షాపులోనూ విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. ఇందంతా పట్టనట్లు ప్రభుత్వ అధికారులు వ్యవహరిస్తుండటంతో నిర్వాహకులు మరింత రెచ్చిపోతున్నారు. ప్రభుత్వానికి మద్యం అమ్మకాలపై ఉన్న ధ్యాస ప్రజారోగ్యంపై లేదని స్పష్టంగా తెలుస్తున్నది. బెల్టు షాపుల ద్వారా మద్యం అమ్మకాలు మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుంటే అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండటం విడ్డూరంగా ఉన్నది

**- ఎల్‌పీ నర్సింహులు, సమాచార హక్కు చట్టం దోమ మండల వైస్ ప్రెసిడెంట్**

**మహిళలు ఊళ్లో తిరగలేకపోతున్నారు..**



మందుబాబుల భయానికి సాయంత్రమైతే చాలు మహిళలు ఊళ్లో తిరగలేకపోతున్నారు. ప్రతి వీధికీ ఒక బెల్టు షాపు ఉన్నది. అడిగేవారు లేకపోవడంతో విచ్చలవిడిగా మద్యాన్ని విక్రయిస్తున్నారు. దీనిపై ఎవరైనా ప్రశ్నిస్తే గొడవలకు దిగుతారు. తాగిన మైకంలో పలువురు మందుబాబులు అకారణంగా గొడవలకు దిగుతున్నారు. బెల్టు షాపుల తొలగింపునకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

**-నాగరాజు, రొంపల్లి, బంట్వారం మండలం**

**బెల్టు షాపులు విపరీతంగా పెరిగాయి..**



గ్రామాల్లో బెల్టు షాపులు విపరీతంగా పెరిగాయి. దీంతో మైనర్లు సైతం తాగుబోతులుగా మారుతున్నారు. మద్యంతో కుటుంబాల్లో గొడవలు పెరుగుతున్నాయి. వ్యవసాయ పొలాల వద్ద, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి సీసాలు పగులగొట్టడంతోపాటు ఇతరులపట్ల ఇష్టమొచ్చినట్లు ప్రవర్తిస్తున్నారు. వ్యవసాయ పనులు చేస్తున్నప్పుడు ఎద్దులు, రైతుల కాళ్లకు మద్యం సీసాలు గుచ్చుకుని గాయాలవుతున్నాయి. గ్రామాల్లో మద్యం అమ్మకాలను అరికట్టాలి.

**-అరుణ్, పట్లూర్, మర్పల్లి**

# ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు

**రంగారెడ్డి కలెక్టర్ శశాంక**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, జూలై 8(నమస్తే తెలంగాణ) : రంగారెడ్డి జిల్లా సమీకృత కార్యాలయ సమావేశ మందిరంలో రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్, పంచాయతీరాజ్, పోలీసు, హెచ్‌ఎండీఏ లేక్స్, విద్యుత్తు, సర్వే శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ శశాంక ప్రభుత్వ భూముల పరిరక్షణ, సరస్సుల ఆక్రమణల తొలగింపుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి రక్షించడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ భూములు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ ఏరియాలో ఆక్రమణలను తొలగించడం కోసం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఏసీపీ స్థాయిలో రెండు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎల్బీనగర్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాలకు ఒక టీమ్‌ను, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, షాద్‌నగర్, చేవెళ్ల నియోజకవర్గాలకు మరో టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్, పంచాయతీ, పోలీసు శాఖల అధికారుల సహాయంతో ప్రభుత్వ భూములు, ఎఫ్‌టీఎల్, బఫర్ ఏరియాలో జరిగిన ఆక్రమణలపై టాస్క్‌ఫోర్స్ బృందాలతో భౌతిక తనిఖీ నిర్వహించి, అన్ని రకాల అక్రమ నిర్మాణాలను అరికట్టడానికి వెనువెంటనే అవసరమైన చర్యలను తీసుకోవాలని ఆదేశించారు. ఈ విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించినట్లయితే సీసీఏ నిబంధనల ప్రకారం వారిపై చర్యలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు, రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, మున్సిపల్ కమిషనర్, హెచ్‌ఎండీఏ లేక్స్, పంచాయతీ, విద్యుత్, సర్వే సిబ్బంది తదితర అధికారులు టాస్క్‌ఫోర్స్ బృందాల్లో ఉంటారని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్‌వో సంగీత, ఆర్డీవోలు సాయిరాం, సూరజ్ కుమార్, అనంతరెడ్డి, వెంకట్‌రావు తదితరులు పాల్గొన్నారు.



పూర్యానాయక్ గతంలో అమ్ముకున్న భూమి పత్రాలను చూపుతున్న స్థానిక గిరిజన నాయకులు, రైతులు

# భూమి లేకపోయినా పాస్‌బుక్

**7 గుంటల భూమి ఉన్నట్టు పట్టా పాసుపుస్తకం అందజేత**

**శంషాబాద్‌లో ఇరువర్గాల మధ్య ఘర్షణ**

శంషాబాద్ రూరల్, జూలై 8 : భూమి లేకపోయినా ఓ వ్యక్తికి 7 గుంటల భూమి ఉన్నట్టు పట్టాదారు పాస్‌బుక్ రావడంతో శంషాబాద్ మండలంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకున్నది. శంషాబాద్ మండలంలోని జూకల్ గ్రామ రెవెన్యూ పరిధిలోని అలీకోల్‌తండాకు చెందిన కేతావత్ పూర్యా నాయక్‌కు సర్వే నంబర్ 192లో 1 ఎకరాల 38 గుంటల భూమి ఉండేది. అయితే 2008లోనే అతడు తన వ్యక్తిగత అవసరాల నిమిత్తం ఆ భూమిని మరొకరికి విక్రయించాడు. కాగా, కేతావత్ పూర్యానాయక్‌కు అక్కడే 7 గుంటల భూమి ఉన్నట్లు ధరణి రికార్డుల్లో ఉంది. ఈ మేరకు తహసీల్దార్ నాగమణి పూర్యా నాయక్‌కు పట్టాదారు పాస్‌బుక్కును పంపిణీ చేశారు. భూమి లేకపోయినా పట్టాదారు పాస్‌బుక్ చేతికి అందడంతో పూర్యానాయక్ సోమవారం ఆ భూమిని స్వాధీనం చేసుకోవడానికి వచ్చాడు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకున్నది. ఇది ధరణి తప్పిదమా లేక తహసీల్దార్ నాగమణి చేసిన తప్పిదమా తెలియక 7 గుంటల భూమి కోల్పోయిన వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా లేని భూమికి పట్టాదారు పాస్‌బుక్కులు ఇచ్చిన తహసీల్దార్ నాగమణిపై చర్యలు తీసుకోవాలని స్థానిక గిరిజనులు కోరుతున్నారు. ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. తహసీల్దార్ నాగమణి వివరణ కోసం సంప్రదించగా ఆమె అందుబాటులోకి రాలేదు.

# డెంగీ, మలేరియా ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

**వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశం**

వికారాబాద్, జూలై 8 : డెంగీ, మలేరియా వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. స్వచ్ఛమైన తాగునీరు సరఫరా జరిగేలా చూడాలన్నారు. గురుకుల పాఠశాలలు, వసతి గృహాల పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. నీటి నిల్వలు ఉండకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏఎన్‌ఎం వసతి గృహాలు, పాఠశాలల వంట గదులను సందర్శించి తగు సూచనలు చేయాలన్నారు. మురుగు నీటి నిల్వ ఉన్న చోట బ్లీచింగ్ పౌడర్, ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. గురుకులాలు, వసతి గృహాల్లోని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని, అదేవిధంగా మందుల కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లోనూ ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించేలా ఉత్తర్వులు జారీచేయాలని డీఈవోకు సూచించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సుధీర్, వైద్యారోగ్యశాఖ అదనపు డైరెక్టర్ అమర్ సింగ్ నాయక్, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి పల్వన్ కుమార్, డీఈవో రేణుకాదేవి, ఎస్సీ, బీసీ, మైనార్టీ శాఖల అధికారులు మల్లేశ్, ఉపేందర్, హనుమంతరావు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

# నిల్చునేందుకూ స్థలం లేదు

**రద్దీ సమయాల్లో కిక్కిరిసిపోతున్న మెట్రో రైళ్లు**

**అయినా సర్వీసులను పెంచని ఎల్‌అండ్‌టీ**



సిటీబ్యూరో, జూలై 8 (నమస్తే తెలంగాణ): రోజురోజుకూ ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్నా మెట్రో సర్వీసులను పెంచేందుకు మాత్రం ఎల్‌అండ్‌టీ ససేమిరా అంటున్నది. అందుబాటులో ఉన్న మెట్రో కోచ్‌లతోనే నెట్టుకు వస్తున్నది తప్ప, కొత్త కోచ్‌లను తీసుకువచ్చేందుకు మాత్రం చర్యలు తీసుకోవడం లేదు. ఫలితంగా మెట్రో రైళ్లలో బాగా రద్దీ పెరిగిపోతున్నది. ఉదయం 8.30 నుంచి 11 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల మధ్య మియాపూర్ నుంచి ఎల్బీనగర్ మార్గంలో, రాయదుర్గం నుంచి అమీర్‌పేట మార్గంలో మెట్రో రైళ్లలో నిల్చునేందుకు కూడా స్థలం ఉండడం లేదని మెట్రో ప్రయాణికులు వాపోతున్నారు.

ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించే మెట్రో రైళ్ల సంఖ్యను రద్దీకి అనుగుణంగా పెంచాలని నగరవాసులు సూచిస్తున్నారు. ప్రధానంగా రాయదుర్గం నుంచి అమీర్‌పేట వరకు ఉన్న మార్గంలో ప్రతి 3 నిమిషాలకు ఒక రైలును నడుపుతామని మెట్రో అధికారులు చెప్పినా, మెట్రో రైళ్ల ఫ్రీక్వెన్సీ మాత్రం అందుకు అనుగుణంగా ఉండడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మెట్రో అధికారులు రద్దీ సమయాల్లో నిర్దేశిత మార్గాల్లో అదనపు రైళ్లను నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

### ట్రాకుల వద్ద లైన్ దాటి..

మరోవైపు.. రద్దీ సమయాల్లో మెట్రో స్టేషన్ ప్లాట్‌ఫామ్‌లు ప్రమాదకరంగా మారాయి. రద్దీ అధికంగా ఉండే పలు మెట్రో స్టేషన్‌లలో ప్రయాణికులు రైలు ఎక్కే సమయంలో ప్లాట్‌ఫాం వద్ద నిర్ణయించిన ట్రాక్ లైన్ దాటి ముందుకు వెళ్లి నిలబడుతున్నారు. పెరిగిపోతున్న రద్దీతో మార్కింగ్‌కు లైన్ అవతల ప్రతి నిమిషానికీ జనం పెరిగిపోతూ ఉండడంతో సిబ్బంది నియంత్రించలేకపోతున్నారు. రైలు వచ్చే సమయంలో ప్రయాణికులందరూ ఒకేసారి డోర్‌వైపు కదులుతుండడంతో ట్రాక్‌పైన పడిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.